

# పునర్నిర్వచనం

**కా**వాలని, తను ఎంతో యిష్టపడి చేరిన ఆ ప్రైవేట్ పాఠశాలలో, నలభైమంది విద్యార్థులున్న రెండవ తరగతి పిల్లలకు పాఠం చెప్పి, రెండు చేతులనిండా చాక్‌పీస్‌పొడి దుబ్బతో, చెదిరిన వెంట్రుకల్తో, కొద్దిగా అలసి, ఎంతో తృప్తిగా అప్పుడే స్టాఫ్‌రూంలోకి వచ్చింది డాక్టర్ శిశిర. ఆ క్షణంలో ఆమె మానసిక స్థితి ఆకలిగొన్న దూడకు కడుపునిండా పాలిచ్చి., ఏ భాషకూ అందని అద్భుతానుభూతిని అనుభవిస్తున్న తల్లి ఆవులా ఉంది. కుర్చీలో కొద్దిసేపు కూర్చుని, కళ్ళుమూసుకుని అలా కాస్సేపు ఉండి.,

అప్పుడర్థమైందామెకు..,

స్టాఫ్‌రూంలో ఎవరూ లేరు..తనొక్కతే.

బయట నిలకడగా కురుస్తున్న వర్షం. చినుకుల చప్పుడు. నిశ్శబ్దంలో శబ్దం.

లేచి వెళ్ళి కిటికీ తలుపులు తెరిచింది. రివ్వున చల్లని తడిగాలి దూసుకొచ్చి..శరీరమంతా చిత్రమైన పులకింత. కిటికీ అవతల చెట్లు..చినుకుల్లో తడుస్తూ..చినుకులకు కదుల్తూ, ఆకులు...యింకా అవతల..సన్నని కాలిబాట.. తడుస్తూ ఆడుకుంటున్న పిల్లలు..తడుస్తూనే హడావిడిగా నడుస్తూ వెళ్తున్న మనుషులు.,

ఎవరో కవి రాసిన..రాత్రి తను చదివిన కవితా పాదాలు జ్ఞాపకమొచ్చాయి శిశిరకు.

'ప్రపంచాన్ని దర్శించాలంటే తప్పకుండా తలుపులు తెరవాల్సిందే
బయట వర్షం పిలుపు విని గదిని తెరిచానుగదా,
కురుస్తూ కురుస్తూ చినుకులు కవిత్వమౌతూండడం
చెట్లు, చెట్ల ఆకులూ, కొమ్మలూ కవిత్వమౌతూండడం
వీధిలో నగ్నంగా ఆడుకుంటున్న పసిపిల్లలు కవిత్వమౌతూండడం
చివరికి కవిత్వమే మనిషిగా మారుతూండడం..ఎంత జీవదృశ్యమిది-'

వర్షం గురించి, వర్ష పరశం గురించి ఎంత గొప్పగా చెప్పాడు కవి.

ఎంతసేపుందో వర్షంలోకి చూస్తూ.

గత ఐదురోజులుగా ఒకటే వర్షం..రాష్ట్రమంతటా, ఎడతెరపి లేకుండా, రాత్రింబవళ్ళూ ఒకటే ఎడతెగని వర్షం..కొన్ని ప్రాంతాల్లో వరదలు.

ఐనా..తనకు మాత్రం వర్షం..ఎంతో హాయిగా ఉంది. చిన్నప్పట్నుంచీ అంతే..వర్షమంటే పిచ్చి. వర్షంలో తడవడం, వర్షంలో ఎగరడం, వర్షంలో తడుస్తూ అలా నడచిపోవడం..వర్షమై జీవించడం..

జీవించడమంటే జ్ఞాపకమొచ్చింది..రాత్రి చదివిన ఆ పుస్తకమే.. మరణించకపోవడమే జీవితమైనపుడు, మనిషి తనకు నచ్చినట్టు తాను జీవించలేకపోవడమే మరణం..అన్నాడా కవి.

మనిషి..ప్రస్తుత ఈ సమాజంలో తనకు నచ్చినట్టుగా తాను జీవించగల్గుతున్నాడా. అడుగడుగునా రాజీపడ్తూ, సర్దుకుపోతూ, లొంగిపోతూ.. చివరికి తనను తాను కోల్పోతూ, వ్యక్తిగత యిష్టాయిష్టాలను అభిరుచులను, ఆదర్శాలను..అన్నింటినీ చంపుకుని..ఎవరైనా నిజంగా..ఆత్మతృప్తిగా జీవిస్తున్నారా.. అలా జీవించలేనపుడు వీళ్ళందరూ వర్చువల్‌గా మరణించినట్టేనా..వీళ్ళందరూ జీవిస్తూ మరణిస్తున్నట్టా..మరణిస్తూ జీవిస్తున్నట్టా –

యింతకూ..తనసంగతేమిటి. తను నిజంగా జీవిస్తున్నట్టేనా.

శిశిర ఎదుటనున్న కిటికీ రెక్క దబాలున మూసుకుపోయి..పెద్ద చప్పుడైంది. వర్షం ఉన్నట్టుండి పెద్దదై..వాతావరణం బీభత్సమైంది.

శిశిర వెనక్కి తిరిగి..కుర్చీలో కుర్చోబోయి..మళ్ళీ నాల్గడుగులు నడిచి చాక్‌పీస్ పొడి చేతుల్తోనే టి.వి. ని ఆన్‌చేసి వచ్చి కుర్చీలో చేరగిలబడింది.

జీవితమంటేనే రాజీపడడమా..రాజీపడకుండా జీవించలేమా..గాంధీ తన 'ఆత్మకథ'లో చెప్పినట్టు రాజీపడకుండా జీవించడం మొదలుపెట్టిన తర్వాతనే అసలు జీవించడమంటే ఏమిటో అర్ధమౌతుందా. రాజీపడడం అనేది స్త్రీకీ, పురుషునికీ ఒక విధమైన జీవిత సందర్భమేనా. స్త్రీకి ఉన్నన్ని ప్రతిబంధకాలు జీవితాచరణలో పురుషులకు ఉండవన్నది నిజంకాదా.

తన విషయంలోనే ఏంజరిగింది.. పెళ్ళయిన కొత్తలో..డాక్టరేట్ పూర్తయి తర్వాత..ఒకేసారి మూడు ఉద్యోగాలొచ్చాయి. ఒకటి ఈ ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా, కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఎసిటివోగా, యూనివర్సిటీలో లెక్చరర్‌గా.

ఎసిటివోగా చేరమని హరి పోరు. ఎందుకంటే బోలెడన్ని లంచాలు, తర్వాత ఆకర్షణీయమైన ప్రమోషన్లు, అధికారాలు, ఆధిపత్యాలు-అంతా డబ్బు.. సంపాదన..సుఖాలు

తను రాజీపడిందా. ఉహుం.,

జీవితాన్ని అర్ధవంతంగా..తనకు నచ్చిన విధంగా జీవించడం కోసం.. ఎవరికీ యిష్టంలేని ఒక తనకు మాత్రమే ప్రీతిపాత్రమైన ఈ ప్రాథమిక తరగతి విద్యార్థులకు పాఠం చెప్పవలసిన పాఠశాల ఉపాధ్యాయినిగానే చేరింది.

యింట్లో ఒక యుద్ధం.

ఎన్ని యుద్ధాలు చేసిందో తను..తన పుట్టుక, రచయితైన తన తండ్రి పెంపకం, జీవితాన్ని నిర్వచించుకోవడం, సమాజాన్ని అధ్యయనం చేయడం.. పుస్తకాలలో ప్రపంచాన్నీ, ప్రపంచ మానవులనూ దర్శించడం..జీవితాన్ని శరీరంతో కాకుండా హృదయంతో జీవించడం.,

పెళ్ళిచూపులనబడే తంతుతో ప్రారంభమైంది అసలు యుద్ధం.

వెకిలి ప్రశ్నలు..వెకిలి చేష్టలు..సంప్రదాయాల పేరుతో వెర్రి వెర్రి పనులు.. తాము చేయడాలు..తనను చేయమని ఇతరులు బలవంతపెట్టడాలు.

రాజీ ప్రారంభమైంది..ఓడిపోవడం మొదలైంది. గాజు దిమ్మెవంటిదనుకున్న జీవితం.. సబ్బుబిళ్ళవలె కరగడం..ఆరంభమై మెలమెల్లగా ఆకారాన్ని కోల్పోతూ.,

ఆ రోజు రాత్రి అమ్మ చెప్పింది..

'అమ్మా.. స్త్రీకి రెండు జీవితాలు.

ఒకటి యిక్కడ..మరొకటి అక్కడ' అని. కాని అమ్మ స్త్రీకి ఎన్ని మరణాలో చెప్పలేదు.

అప్పటికే ఐఎఎస్ ఆఫీసరైన హరి.. మొదటిరాత్రి..ఏ ప్రభుత్వ అధికార పార్టీలోనో ఫుల్‌గా తాగి.. నోటినిండా మున్సిపల్ మోరీ కంపు వాసనతో, అధికార మదం ఉప్పొంగే కటువైన మాటలతో ఒకపెద్ద సర్పం చటుక్కున పైనపడ్డట్టు

పడ్తే,

..ఏంజేయగలిగింది తను.

అభిరుచులు, యిష్టాయిష్టాలు, సంస్కారాలు, వ్యక్తిగా విలువలు.. యివేవైనా అడ్డొచ్చాయా.

ఉహుఁ..లొంగిపోయిందికదా తను. మౌనంగా, నిస్సహాయంగా, అనివార్యంగా..తప్పనిసర్రై.

జీవితమంటే..ఒక లేలేత గులాబీని మృదువుగా స్పర్శిస్తున్నట్టు.. కలగన్నది తను. ఐతే కల చిదిమేయబడింది.

ఆ పొసగని చర్యలను మొరటు ప్రతిక్రియలను, యాంత్రిక శరీరవాంఛా ఉపశమనలను..అమ్మతో బెరుకు బెరుగ్గా ప్రస్తావించి..ఏమిటమ్మా యిదంతా.. అంటే,

'తప్పదు నాన్నా' అంది..స్త్రీ జీవితమింతే అంది.

దూరంనుండి నునుపుగా కనబడే కొండ..దగ్గరకు చేరగానే..రాళ్ళు, రప్పలు, బొడుసులు, పగుళ్ళు..వికృతాలు–

హరి ఆపాదమస్తకం సంపూర్ణ దుర్మార్గుడనే విషయం పెళ్ళయిన తర్వాత చాలా చాలా తక్కువ సమయంలోనే..పది పదిహేను రోజుల్లోనే స్పష్టంగా తెలిసిపోయింది శిశిరకు.

అసలీ పెళ్ళి అనే తంతు విషయమే చిత్రంగా తోచేది శిశిరకు. భారతదేశంలో జరిగే తొంభైశాతం ఏర్పాటుచేయగా జరుగుతున్న పెళ్ళిళ్ళలో.. నిన్నటిదాకా ముక్కు మొగం తెలియని యిద్దరు వ్యక్తులు రేపు భార్యాభర్తలౌతారు. పెళ్ళిచూపుల పేరుతో ఒకర్నొకరు..ఒకమ్మాయి ఒకబ్బాయి చూచుకోగలిగిందేమిటి. శరీరపు రూపురేఖలు, రంగు, ఎత్తుపల్లాలు తప్పితే కళ్ళకు కనబడేదేమిటి. మనసు సంగతేమిటి. వీడి మనసు ఆమెకు, ఆమె మనసు వీడికి ఎలా తెలుస్తుంది. ఉద్యోగాలు, చదువులు, జీతాలు. ఆస్తులు, కట్నాలు.. యివి తెలుస్తాయి..కాని హృదయం, అభిరుచులు, సున్నితమైన స్పందనలు, వ్యక్తిత్వం, తత్వం..వీటి సంగతేమిటి..యివన్నీ దృష్టంకాని అదృష్ట విషయాలేనా.

ఈమెకు సాహిత్యం, సంగీతం, ప్రకృతి..చల్లని గాలి, చక్కని నవ్వు.. యిష్టం. తాగుడు, తిరుగుడు, పశువులా తినుడు యిష్టంలేదు.

వానికి లంచాలు తీసుకునుడు, సెటప్‌లు, తాగుడు, తిరుగుడు, ఏ నీతినియమాలు లేని పనులైనా చేసుడు..యివన్నీ యిష్టం..

ఘర్షణ..ఘర్షణ..

అయిష్టంగానే పడుకోవడాలు..అయిష్టంగానే కడుపులు రావడాలు.. అయిష్టంగానే పిల్లలను కనడాలు..మనసును లోలోపల చంపి సమాధిచేసి, పైకి ..ముఖంపై నవ్వు మాస్క్ అతికించుకుని..పెళ్ళిళ్ళు, పేరంటాలు, గుళ్ళు,

షాపింగ్‌లు..యికిలింతలు..అంతా ట్రాష్..చెత్త..అంతా రాజీ..అంతా కాకిబంగారం..అంతా గోల్డ్‌కవర్డ్ లైఫ్..నటన..ఆత్మవంచన..రోత.. పలాయనం.. ఓడిపోవడం..ధ్వంసమైపోవడం..

ఒక ఆడ..ఒక మగ..పరస్పరం అసలే పొంతనలేని అభిరుచులతో కలిసి జీవితాంతం జీవించాలనుకోవడం..ఎంత దుర్భరం..ఎంత ఆత్మవంచన..

చటుక్కున టి.వి.లో ఏదో కేకవంటి ధ్వని వినిపించింది శిశిరకు.

ఆలోచనలు తెగిపోయి.,

టి.విలో..నడుంలోతుకన్నా ఎక్కువ నీళ్ళలో మనుషులు.. ముసలివాళ్ళు..ఆడవాళ్ళు, భుజాలపై పిల్లలు..దర్వాజాల వరకు వరద నీళ్ళు.. నీళ్ళపై జరజరా పాకుతూ ఒక పాము వాళ్ళపైకి బుస్సన లేస్తే..భుజంపై వున్న ఒక చిన్న పిల్ల కెవ్వున వేసిన కేక అది.

టి.వి. వ్యాఖ్యాత చెబుతున్నాడు,

కృష్ణాజిల్లా, ఘంటసాల మండలం, జలగలగండం మారుమూల గ్రామం జలదిగ్భంధంలో ఉండి ఆరు రోజులైనా యింతవరకూ ఏ ప్రభుత్వాధికారీ ఒక్కడూ రాలేదు. ఊరి జనమంతా రోజులకు రోజులు నడుంపైదాకా నీటిమట్టంలో అలా నిలబడి, ఆ నీటినే తాగుతూ, ఆ నీటిలోనే వుచ్చలు పోసుకుంటూ, తిండీ తిప్పలు లేక..చివరికి ఎవరో టి.వి. టీం పనిగట్టుకుని అక్కడికి పోతే హృదయవిదారకంగా ఏడుస్తున్నారు. శాపనార్థాలు పెడ్తున్నారు. అల్లాడ్తున్నారు. అలమటిస్తున్నారు.

కాని ఆదుకునే నాధుడేడి?

ఇరవై ఒకటవ శతాబ్దంలో, కృష్ణాజిల్లావంటి అభివృద్ధి చెందిన జిల్లాలో.. ఒక గ్రామం ఆరురోజులుగా ప్రపంచంతో సంబంధాలు తెగి జలదిగ్బందంలో రేయింబవళ్ళు వర్షంలో, వరదల్లో చీకట్లో మగ్గిపోతోంది అంటే..ఈ ప్రభుత్వమేమిటి..ఈ దుర్మార్గ అధికార యంత్రాంగంమేమిటి..సిగ్గులేని ఈ సభ్యసమాజమేమిటి..ఈ ఉదాసీన, నిర్లక్ష్య వ్యవస్థ ఏమిటి.?

సిగ్గుతో తుఫానులో గడ్డిపరకలా చలించిపోతున్న శిశిరకు..టి.వి. క్రింది బాగాన ప్లాష్..ప్లాష్..అని ఒక స్క్రోల్ కనబడింది.

"తన కింది మహిళా ఉద్యోగినిని ఎప్పటినుండో లైంగికంగా వేదిస్తున్న ఐఎఎస్ అధికారికి చెప్పుదెబ్బలతో గుణపాఠం' - అదీ వార్త.

ఆ వార్త పదే పదే బ్లింక్ ఔతూ ప్రముఖంగా చూపెట్టబడ్తోంది .. అరనిముషం తర్వాత..వరద విషయం ముగియగానే..వార్తలు చదువుతున్న వ్యక్తి "...విద్యాశాఖ కమిషనర్‌గా పని చేస్తున్న ఐఎఎస్ అధికారి హరి తన క్రింద పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగినిని గత యిరవై రోజులనుండి లైంగికంగా వేదిస్తున్న విషయాన్ని ఆమెద్వారా తెలుసుకున్న టి.వి. గత రెండు రోజులుగా వివరాలను పరిశోధించి ఈ రోజు బట్టబయలు చేసినపుడు.."

కొన్ని క్లిప్పింగ్స్ చూపడం మొదలైంది..

ఆమెను ఒక్క అరగంటలోనే హరి తన గదిలోకి ఐదుసార్లు పిలవడం,

ఆమె సెల్‌ఫోన్‌కు బూతు ఎస్సెమ్మెస్‌లు చేయడం,

సెల్‌ఫోన్‌లో హరి తన నీచమైన కోరికను తెలియజేయడం,

ఆమె టి.వి. వాళ్ళ సూచనమేరకు..హరితో అంగీకారం తెలిపి అతని ఆంటీరూంలోకి వెళ్ళడం..తర్వాత..అంతా కెమెరాల్లో బట్టబయలు.

వెన్వెంటనే ఆమె తన కాలికున్న చెప్పును తీసి హరి చెంపలపై టప టపా కొట్టడం. అదే సమయంలో ఆఫీస్ ఇతర సిబ్బందికూడా..అందరూ ఎగబడి హరిని కొట్టడం, తన్నడం-హరి ముఖాన్ని దోసిట్లో దాచుకుని..తన్నులు పడ్తూండడం..

వెనుకనుండి టి.వి. వ్యాఖ్యానం.

ఈ ఐఎఎస్ అధికారి వెనుక యింకా యిటువంటి అనేక లైంగిక ఆత్యాచార ఆరోపణలే కాకుండా, అనేక అవినీతి ఫిర్యాదులు, అధికార దుర్వినియోగ అభియోగాలూ ఉన్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం వెంటనే..." వార్తా కథనం కొనసాగుతూనే ఉంది.

డాక్టర్ శిశిర అప్రతిభురాలైంది..చెప్పుదెబ్బలు తింటున్నది తన భర్త.. గ్రేట్ హరి ఐఎఎస్.

ఈ విషయాలేవీ తనకు కొత్తవి కాదు. అన్నీ తెలిసిన సంగతులే.. నిత్యం తన దృష్టికి వస్తున్న దుర్మార్గాలే..ఐతే,

యిప్పుడు గదిలోపలి విషయాలు గది బయటికి..రోడ్డుపైకి వచ్చాయంతే.

ముడి వీడింది..మురిక్కాలువ ముంచెత్తుతూ అంతా దుర్గంధభరితమైపోయింది.

ఈ విషయం టి.వి.లో ఎప్పట్నుండి వస్తోందో.,

అందుకే స్టాఫ్‌రూంలో ఎవరూ లేరు? తను ఒంటరిగా..

శిశిరకు..భూమి బ్రద్దలౌతున్నట్టుగా, తన జీవితం కుప్పకూలుతున్నట్టుగా, తమ పరువు రోడ్లపై ప్రవహిస్తున్నట్టుగా, అవమానంగా, అసహ్యంగా.. తను కుంచించుకుపోతున్నట్టుగా..యిలా ఏమీ అనిపించలేదు.

చాక్‌పీస్ పొడి అంటిన చేతులతోనే ప్రక్కన టేబుల్‌పై ఉన్న గొడుగును తీసుకుని బయటికి..వానలోకి..నడిచింది. సరిగ్గా అప్పుడే వానధాటికి కొట్టుకున్న కిటికీ తలుపు అద్దం భళ్ళున పగిలి నేలపై పడ్డది. శిశిర అదేమీ పట్టించుకోలేదు.

# 2

వర్షంలో.,

శిశిర కారు తన పన్నెండేళ్ళ కూతురు నీలి చదువుకుంటున్న రెసిడెన్షియల్ పాఠశాలవైపు వెళ్తోంది వేగంగా.

ఆమె మనసు భగభగ మండుతున్న కొలిమిలా ఉంది. చాలా సిగ్గుగా కూడా ఉంది.

ఒక క్యారెక్టర్‌లెస్ బాస్టర్డ్ హరితో అతినీచంగా రాజీపడి పదమూడేళ్ళుగా కాపురం చేస్తున్నందుకు అతి సిగ్గుగా ఉందామెకు. వాల్మీకి తన భార్యాపిల్లలను తన దోపిడీలో మీకెవరికీ భాగం లేదా అని ప్రశ్నించినట్టు హృదయం ఈ రోజు..యిన్నేళ్ళుగా తన భర్త చేస్తున్న అకృత్యాలను, అవినీతి పనులను, దోపిడి సంపాదనను తాము భరించారూ అంటే ఆ నీచమైన అన్ని పనుల్లోనూ తమకు భాగస్వామ్యమున్నట్టేగద. ఒక దుర్మార్గుణ్ణి ప్రశ్నించకపోవడం, చూస్తూ ఊర్కోవడం..సామాజిక బాధ్యతను విస్మరించి మిన్నకుండడం..యివన్నీ నేరాలేకదా. చుట్టూ ఉన్న సంఘం కోసం, పరువుకోసం, కుటుంబ గౌరవంకోసం, తల్లిదండ్రులకోసం, కన్నబిడ్డకోసం హరితో అంతరాంతరాల్లో ఎన్ని విభేదాలున్నా పైపైకి కలసి కాపురం చేస్తున్నట్టుగా నటించడంకూడా క్షమించరాని ద్రోహ చర్యేకదా.,

అసలు తాను హరితో పెళ్ళయిన కొత్తలోనే విభేదించి తన దారి తాను చూచుకోవాల్సింది. తన సిద్ధాంతాలు, తన ఆదర్శాలు, తన నైతికతతో కూడిన భవిష్యత్ కలలు..యివన్నీ ధ్వంసమై తను ఒక అతిసాధారణ గృహిణిగా మిగిలిపోతున్నా..యిన్నాళ్ళూ ఎందుకు మౌనంగా ఉన్నట్టు.

తనకు తెలియకుండానే తన జీవితం ఎంతో ఛిద్రమైపోయింది.

యిప్పటికైనా..తన వ్యక్తిత్వం..తన ఆలోచనలు..తనకు ఆత్మతృప్తిని కలిగించే శేషజీవితం..వీటిగురించి నిబద్ధంగా యోచించాలి. మళ్ళీ తప్పు చేయకూడదు. మళ్ళీ రాజీపడకూడదు. తను తనకు నచ్చని జీవితాన్ని మరణతుల్యంగా జీవించకుండా, ఒక భార్య, ఒక తల్లి, ఒక పౌరురాలిగా తనను తాను పునర్నిర్వచించుకోవాలి.

వర్షం కురుస్తూనే ఉంది.

కారు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించి.,

చటుక్కున ఇంతకు ముందు టి.విలో కనబడ్డ దృశ్యాలు, వ్యాఖ్యలు. అన్నీ మనస్సులో మెదిలాయి. హరిని ఎవరో ఆ ఉద్యోగిని చెప్పుతో కొడ్తూండడం.. అందరూ తలా ఒక దెబ్బ..తన్నులు..తొక్కుడు..ఛీ ఛీ..

ప్రిన్స్‌పాల్ చాంబర్‌లోకి వెళ్లి తన కూతురు నీలిని వెంట తీసుకెళ్తానని

ఒక దరఖాస్తు రాసిచ్చి.,

సిగ్గనిపిస్తోంది శిశిరకు. టి.వి. ని చూచిన వాళ్ళెవరైనా తనను హరి భార్యగా గుర్తించి ఏదైనా అడుగుతారేమోనని..చాలా సిగ్గుగా ఉంది.

హరి దుశ్చర్యల పొడ సోకకుండా ఉంటానికనే తను నీలిని చిన్నప్పట్నుండీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉంచి చదివిస్తోంది. ఎటువంటి కాలుష్యమూ అంటకుండా చాలా స్వచ్ఛమైన వ్యక్తిగా నీలిని తీర్చిదిద్దాలని తన ఆశ. నీలి అలానే ఎదుగుతోంది కూడా. నీలికి యిప్పటికే లోకం గురించి చాలా తెలుసు.

ఐతే నీలి కూడా ఒక అమ్మాయేగదా..చిన్నప్పటి తనవలెనే.

తననుకూడా నాన్న ఎంతో క్రమశిక్షణతో, ఆదర్శాలతో పెంచాడుగదా. తన విషయంలో ఏంజరిగింది..అమ్మ చెప్పినట్టు ప్రతి స్త్రీకి 'యిక్కడ ఒక జీవితం.. అక్కడ ఒక జీవితమేనా.' రేపు నీలి కూడా ఈ స్థితికి అతీతం కాదా.

పదినిముషాల్లో నీలి వచ్చింది చేతుల్లో ఒక బ్యాగ్‌తో,

వస్తూనే..'అమ్మా..'అని హత్తుకుపోయింది.

కళ్ళలో కనిపించని పల్చని నీటిపొర..తనువంతా ఒక ఉద్వేగం. హృదయాన్ని ధరించిన వేలు మీటితే పలుకుతున్న ఏక్‌తార తంత్రివలె..సన్నని సున్నిత ప్రకంపనలు.

పాప చిటికెన వేలిని పట్టుకుని..వర్షంలో నడుస్తూ వచ్చి..కార్లో కూర్చుని..కారుని స్టార్ట్ చేసింది.

కారు యింటివైపు బయల్దేరింది.

..యింకా వర్షం కురుస్తూనే ఉంది..ఎడతెగకుండా.

## 3

'నీలీ, ఈ సోఫాలో కూర్చుని..టి.వి. చూస్తూండమ్మ..నేనిప్పుడే డ్రెస్ మార్చుకోని వస్తాను" అని లోపలికి వెళ్ళింది శిశిర.

రెండుకోట్ల రూపాయలతో పదేళ్ళక్రితం నిర్మించిన పాలరాతి భవనమది.

శిశిరకది బంగారు పంజరంలో జీవితం.

'ఎందుకివన్నీ మనకు. నీతివంతంగా ఏ డబుల్ బెడ్రూం అపార్ట్‌మెంట్‌లో మనం ఉన్నా ఫర్వాలేదు' అని అనేది తను హరితో.

అందుకు జవాబు "షటప్" అని..లేకుంటే సిగరెట్ పీకలతో తొడలపై మరకలు.

..రాజీ..రాజీ..బ్రతుకంతా భయం..భేషజం. సర్దుకుపోవడం.

బెడ్రూంలోకి వెళ్తున్న శిశిరకు తెలుసు తను తిరిగి వచ్చేలోగా టి.వి. ఛానల్ ద్వారా తన తండ్రి ఘనకార్యం నీలికి తెలుస్తుందని..ఆ ఫ్లాష్ కథనం

ప్రతి పది నిముషాలకోసారి ప్రసారమౌతూనే ఉంది.

శిశిర చాలా స్పష్టమైన నిర్ణయం తీసుకుంది వార్త విన్నపుడే. చకచకా బీరువాలు, రహస్య స్థావరాలు అన్నీ తెరిచి గుప్తంగా ఉంచిన ఎన్నో పేపర్స్, ఎఫ్‌డీల బాపతు కాగితాలు, బ్యాంక్ లాకర్ల వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఎటిఎం కార్డులు వాటి పాస్‌వర్డ్ నంబర్లు..నల్లడబ్బు వివరాలు..ఆస్తులు..వెదుకుతోంది ఒకటొక్కటి.

ఆమెకాక్షణం తనకు తాను బురదలో పొర్లుతున్న పందిలా అనిపించింది.

తన బీరువాకూడా వెదుకుతూండగా తన పదమూడేళ్ళ డైరీలు కనిపించాయి.

ఒకటి తెరిచింది.

మార్చి 8, 1993

నిన్న శోభనం రాత్రి.

నా జీవితం ఎంత క్రూరంగా విధిచేత ధ్వంసం చేయబడిందో అర్థమైంది.

మేకపిల్ల లాంటినేను హరి అనబడే సింహం గుహలోకి నిర్దాక్షిణ్యంగా ప్రవేశపెట్టబడ్డాను.

ఎవరికీ చెప్పుకోలేని ఈ దుఃఖాన్ని నేనే నిశ్శబ్దంగా దిగమింగడం కంటే మార్గం కనిపించడంలేదు.

ఓడిపోయాను. మానసికంగా చచ్చిపోయాను.

స్త్రీ జీవితం తన ప్రమేయం లేకుండానే యిలా బలైపోతుందని తెలుసుకోవడం చాలా రోతగా ఉంది. నాపై నాకే అసహ్యం.

మరొక డైరీ.

జూలై 16, 1994

పాప బారసాల. ఎంత ముద్దుగా ఉందో పాప. దోసిట్లో గులాబీ. నీలి కళ్ళు.

హరి చెప్పిన రోత పేర్లన్నింటినీ కాదని..నాకిష్టమైన పేరు పెట్టాను. నీలి.

నేను పాపను కలిగిఉండడమొక్కటే యిక నా ఎడారిజీవితానికి ఊపిరి.

హరి నిజస్వరూపం తెలుస్తున్నకొద్దీ అసహ్యం యింకా యింకా పెరుగుతోంది. ఎప్పుడో విడివడిపోయాను అతన్నుండి మానసికంగా, భౌతికంగా.

హి రేప్స్ మీ నౌ అండ్ దెన్.

..అంతా అసహ్యం.

పాఠశాలలో పసిపిల్లలకు పాఠం చెప్పడమొక్కటే..తృప్తి..ఆనందం.

ఇంకొక డైరీ,

ఆగస్ట్ 23, 2004

నీలి తన రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులందర్లోకి టాపర్‌గా పురస్కారం పొందింది.

ఎంత పరిణతి కనిపిస్తుందో పాపలో.

హరికి కూతురన్నా ప్రేమ ఉండదు. ఎంతసేపూ డబ్బు..ఆస్తులు..కోట్లు.. కుట్రలు..సంపాదన..ప్రమోషన్లు..అక్రమాలు..ఆక్రమణలు..ఒక చీడపురుగు.

పాప ఈ రోజు నాప్రక్కలో పడుకున్నప్పుడు..ఎంతో తృప్తి..ఎంతో ఆనందం..ఎంతో ఉద్వేగం..ఎంతో పరవశం. దీన్ని తండ్రినీడ సోకకుండా పెంచాలి. సాధ్యమౌతుందా..మొక్కను చిన్నప్పట్నుండే నిటారుగా పెంచాలి కదా.

శిశిర డైరీ చూస్తూండగానే.,

"అమ్మా..అమ్మా.." అని కేకల్లాంటి అరుపులు నీలినుండి,

శిశిర ఊహించిందే అది. హాల్లోకి నడిచింది.

"అమ్మా..యిది చూడు..ఐ హేట్ దిస్ బాస్టర్ట్.." అంటోంది నీలిముఖం నిండా అసహ్యాన్ని నింపుకుని..టి.వి.లో ప్రసారమౌతున్న క్లిప్పింగ్స్‌కు ప్రతిస్పందనగా.

శిశిర..నీలి కళ్ళలోకి ఒక్కక్షణం నిర్మలంగా చూచి..పాప తలను హృదయానికి ఆనించుకుని..అరచేతితో తలను నిమిరి..కాస్సేపలాగే ఉండిపోయి.,

కొద్దిసేపటి తర్వాత.,

టెలిఫోన్‌ను తీసుకుంది.

మొదట చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంట్‌తో తర్వాత కమిషనరాఫ్ పోలీస్‌తో, డైరెక్టరాఫ్ ఆంటీ కరప్షన్ బ్యూరోతో, లాయర్ ప్రతిమాదేవితో అన్ని పత్రికలూ, టి.వి. ఛానళ్ళతో మాట్లాడింది వరుసగా.

బయట వర్షం కురుస్తూనే ఉంది ఎడతెగకుండా.

## 4

'హరి సదనము'...కోట్లరూపాయల పాలరాతి భవనం.. బయట బలమైన యిత్తడి గేట్‌కు తాళం వేసి ఉంది.

గేట్ బయట..

వందల మంది జనం..పోలీసులు..జీపులు, కార్లు, ప్రెస్, టి.వి. ప్రతినిధులు. కెమెరాలు..బోరున వర్షం.

గేట్ బయట కుర్చీలో గొడుగుపట్టుకుని శిశిర..ప్రక్కన మరో గొడుగుక్రింద..పదమూడేళ్ళ కూతురు నీలి.

ఏం జరుగబోతోంది.? ఉత్కంఠ.

కొద్దిసేపు తర్వాతే సైరన్ మ్రోగించుకుంటూ పోలీస్ వ్యాన్ వచ్చింది. పోలీసుల వలయంలో..హరి..తలవంచుకుని..దస్తీని ముఖానికి అడ్డు పెట్టుకుని..

సిగ్గుతో కుంచించుకుపోతూ,

వెంటనే మీడియా వాళ్ళ దండయాత్ర..పోలీసుల తోపులాట

'జరిగిందాన్ని గురించి మీ కామెంట్'..గుచ్చి గుచ్చి ప్రశ్నలు.. హరినుద్దేశించి.

జవాబు లేని..వంచిన తల.,

గుంపు..గుంపు హరి సదనము గేట్ వద్దకు వచ్చి..పోలీస్ కమీషనర్, ఎసిబి డైరెక్టర్..,

శిశిర గొంతు సవరించుకొంది.

'మీడియా సోదరులందరు జాగ్రత్తగా నా ఒక్కొక్క వాక్యాన్ని ఖచ్చితంగా రికార్డ్ చేసి ప్రపంచానికి తెలియజేయాలని ప్రార్థిస్తున్నాను.'

..అంతా నిశ్శబ్దం..ఒట్టి చినుకుల చప్పుడు.

"దాదాపు పదమూడేళ్ళుగా కలిసి ఇతనితో కాపురం చేసిన నేను ఈ క్షణం హరి అనే ఇతన్ని మొట్టమొదటిసారిగా 'వీడు' అని సంబోధిస్తున్నాను. మొదట వీడిచేత లైంగిక వేదింపులకు గురైన ఆ మహాతల్లికి వీని భార్యగా నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. వీడు మహాపాపి, దుర్మార్గుడు, అవినీతిపరుడు, లంచగొండి, దొంగ..అన్నీ-యిట్లాంటి వీడితో పదమూడేళ్ళు కలిసి కాపురం చేస్తూ యిన్నేళ్ళుగా వీని నిజస్వరూపాన్ని సభ్యసమాజానికి తెలియజెప్పకపోవడం ప్రాథమికంగా ఒక పౌరురాలిగా నా నేరం. అందుకు నన్ను మన్నించమని ఈ సమాజాన్ని వేడుకుంటున్నాను. ఐతే వీన్ని మార్చాలనీ, మనిషిగా చేయాలనీ యిన్నేళ్ళూ ప్రయత్నించి, విఫలమై యిప్పుడు మన భారత సమాజంలో ఏ స్త్రీ చేయని ఒక సాహసోపేతమైన పనిని చేయడానికి పూనుకున్నాను. దీన్ని 'గృహ తిరుగుబాటు' అని అంటున్నాను.

ఈ రోజు టి.వి.లో ప్రసారమైంది కేవలం ఒక్క వీడి లైంగిక అత్యాచార విషయమే. కాని వీడి వెనుక యింకా అనేక అవినీతికర పనుల చిట్టా ఉంది. వాటన్నింటినీ, వీడు సంపాదించిన అరవై ఎనిమిది కోట్ల రూపాయల అక్రమ ఆస్తుల వివరాలనూ, అక్రమ లావాదేవీల గుట్టునూ, ఈ రోజు డాక్యుమెంట్లతో సహా ప్రజలకు నేను సమర్పించబోతున్నాను. ఈ కీలక సమయంలో.. ప్రభుత్వంలో ఉన్న అధికారులు కోటానుకోట్ల రూపాయలతో విలాసవంతమైన భవనాలను కట్టుకుని ఊహకందని భోగభాగ్యాలతో జీవిస్తుంటే.. ఈ ప్రభుత్వానికి వీళ్ళ జీతాలెంత, వీళ్ళు ఆదాయపన్ను పత్రాల్లో చూపే వివారాలేమిటి.. ఈ కోట్లకు కోట్లు వీళ్ళకెక్కడివి.. అనే సందేహం మొద్దు నిద్రపోయే ఈ ప్రభుత్వానికి రాకపోవడం ఒక సిగ్గుచేటైన వ్యవహారంగా భావిస్తూ, ప్రభుత్వాన్ని పత్రికా

ముఖంగా ప్రశ్నిస్తున్నాను. ఎందుకు వీళ్ళపై చర్యలు తీసుకోవడంలేదని. ఈ బహిరంగ అవినీతిని ప్రభుత్వం ఎందుకు కొనసాగనిస్తోందని నిలదీస్తున్నాను. ప్రభుత్వ అధికారులంటే సంపూర్ణంగా లంచగొండులే అని పక్కాగా నిర్ధారించుకున్న ప్రజలు కత్తికింద గొంతుపెట్టడానికి సిద్ధమై జీవిస్తున్నారు దీనంగా. అన్నీ తెలిసి నిద్ర నటిస్తున్న ప్రభుత్వానికి సిగ్గెందుకు లేదు.

ఈ నా చేతిలోని సంచిలో వీని అక్రమాల వివరాలన్నీ ఉన్నాయి. దీన్ని డైరెక్టర్ ఎసిబి గార్కి అందజేస్తున్నాను. అందుకే ఈ భవనానికి తాళం వేసి ఈ పాపసంపాదనతో వీని భార్య బిడ్డయైన మాకు ఏరకమైన సంబంధంలేదని యిందరు జనం సమక్షంలో విముక్తిని పొందుతూ తాళం చెవిని పోలీస్ కమీషనర్ గార్కి అందజేస్తున్నాను.

కోర్టులో భార్యాభర్తల విడాకులకు యింతవరకు వివిధ వ్యక్తిగత వేదింపుల కారణాలవల్ల, గృహహింసల వల్ల అర్జీలు సమర్పించబడ్డాయి. కాని ఈ దుర్మార్గునితో కలిసి కాపురం చేయలేకపోవడానికి వ్యక్తిగత వైరుధ్యాలను కారణంగా పరిగణించి విడాకులు మంజూరు చేయవలసిందిగా మా లాయర్ ప్రతిమాదేవి ద్వారా హైకోర్టుకు ఒక కొత్త సామాజిక సమస్యతో అపీల్ చేస్తున్నాను.

అవినీతితో, నైతిక విలువల పతనంతో కుళ్ళిపోతున్న వర్తమాన భారత సమాజంలో..భర్త బయట ఏ గడ్డితిన్నా ఫర్వాలేదు..రాత్రి కట్టల కట్టలు తేగానే కౌగిలించుకుని, హొయలుబోతూ వెంట ఉండి, అవినీతి భూతాన్ని పెంచిపోషిస్తూ నైతిక బాధ్యతలను విస్మరించి తామూ సంఘద్రోహులుగా మారుతున్న నాలాంటి భార్యలు, ఇల్లాండ్లు..యికనైనా మౌనంవీడి..మన మన యిండ్లలోనే దాక్కుని ఉన్న అవినీతి రాక్షసిని తరిమికొట్టాలనీ..ఒక కొత్త ఒరవడి యికనైనా మొదలవాలనీ ఆశిస్తూ..' ఆమె గొంతు నిప్పులు చెరుగుతోంది.

జనం చప్పట్లు కొడ్తున్నారు.

శిశిర..తన వద్దనున్న భవనం తాళం చెవులు, ఫైళ్ళ సంచీ, మిగతా కాగితాలు..అన్నీ ఆయా అధికారులకు అందజేసి..మెల్లగా నడుస్తూ..

వెంట నీలి ఉంది..చిటికెన వ్రేలును పట్టుకుని,

హరి దగ్గరగా వచ్చింది శిశిర. వాల్చుకున్న హరి తలను జుట్టుపట్టి లేపి..ఎవరూ ఊహించని విధంగా, ఉద్విగ్నతతో మెరుపుకాలంలో కాలికున్న చెప్పును తీసి హరి రెండు చెంపలనూ టపటపా వాయించింది.

పదమూడేళ్ళ నీలి..."ఐ హేట్ యూ..ఐ హేట్ యు.." అని తుపుక్కున తండ్రి ముఖంపై ఉమ్మేసింది.

యిద్దరూ జనంలోనుండి..తమ కారు దిక్కు నడుస్తూ వెళ్తున్నారు తలలను ఎత్తుకుని.

చుట్టూ అవాక్కయిన జనం...ఉక్కిరిబిక్కిరౌతున్న జనం..ఇలా కూడా జరుగుతుందా అని విభ్రాంతికి లోనై నమ్మలేక కొయ్య బారిపోతున్న జనం.,

వర్షం కురుస్తూనే ఉంది.

ఎడతెగకుండా.. నిశ్శబ్దంగా -

●

'స్వాతి' మాసపత్రిక
ఆగస్ట్ 2007